నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 21 జనవరి 2024 | KAMAREDDY




ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నేపథ్యంలో కమ్మర్‌పల్లిలోని మిసిమి హైస్కూల్‌లో విద్యార్థులు శనివారం 'జై శ్రీరాం' ఆంగ్ల అక్షరాకృతిలో కూర్చొని ఆకట్టుకున్నారు. – కమ్మర్‌పల్లి, జనవరి 20

## గడీకోట, టీయూ సౌత్ క్యాంపస్ మధ్య
# అవగాహన ఒప్పందం

దోమకొండ, జనవరి 20: గ్రామ అభివృద్ధి కోసం దోమకొండ గడీకోట ట్రస్ట్, తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకొన్నారు. ఈ మేరకు గడీకోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి, టీయూ రిజిస్ట్రార్ యాదగిరి, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ గడీకోటలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ అధికారులు మాట్లాడుతూ..ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో ఉన్నత విద్యలోచాలా మార్పులు వస్తున్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థిలోఉన్న ప్రతిభను గుర్తించేలా పాఠ్యాంశాలు రూపొందించబడినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో అక్కడి సమస్యలను గుర్తించి పరిష్కారమార్గం సూచించేలా విద్యార్థులు పనిచేస్తారని తెలిపారు. సామాజిక బాధ్యత ప్రతి విద్యార్థి కలిగి ఉండాలనే ఉద్దేశంతో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. అనంతరం గ్రామ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించారు. జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్, సర్పంచ్ అంజలి, ఎంపీపీ కానుగంటి శారదా నాగరాజు, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న గడీకోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యవతి

నిజాంసాగర్, జనవరి 20: నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25లో ఆరోతరగతిలో ప్రవేశం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఎంపిక చేసిన 27 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్ష రాసేందుకు 5252 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3728 మంది హాజరయ్యారని, 1524 మంది గైర్హాజరయ్యారని నవోదయ ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు

# నకిలీ పాస్‌పోర్టుల తయారీలో జిల్లావాసి

### అదుపులోకి తీసుకున్న సీఐడీ

వినాయక్‌నగర్ జనవరి 20: నకిలీ పాస్‌పోర్టుల తయారీకి పాల్పడుతున్న ముఠాలో సభ్యుడు అయిన జిల్లాకు చెందిన ఓ గల్ఫ్ ఏజెంట్‌ను సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నకిలీ ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ, స్టడీ సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తయారు చేస్తూ స్థానికేతరులకు అడ్డదారిలో పాస్‌పోర్టులు ఇప్పిస్తున్న ముఠాతో నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌కు చెందిన సుభాష్‌కు సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు పదేండ్లుగా గల్ఫ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న సుభాష్.. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రధాన ఏజెంట్‌తో పరిచయం ఏర్పడి నకిలీ ధ్రువపత్రాలతో పాస్‌పోర్టులు ఇప్పించే పనిలో ఆరితేరాడు.

**ప్రధాన ఏజెంట్ చెప్పినట్లుగానే...**

హైదరాబాద్‌కు చెందిన ప్రధాన ఏజెంట్ ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తికి సంబంధించిన ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఎడ్యుకేషన్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు జిల్లాకు చెందిన కమీషన్ ఏజెంట్‌కు పంపిస్తాడు. ఆ డాక్యుమెంట్స్‌ను ఎవరి పేరుపై తయారు చేయాలో ప్రధాన ఏజెంట్ సూచిస్తూ వారికి సంబంధించిన ఫొటో, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో పంపిస్తారు. నకిలీ డాక్యుమెంట్లతో పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసి, పాస్‌పోర్టులు ఇప్పిస్తూ డబ్బులు దండుకుంటున్నారు.

**రంగంలోకి సీఐడీ డీజీ ప్రత్యేక బృందాలు..**

భీమ్‌గల్‌కు చెందిన కమీషన్ ఏజెంట్ సుభాష్‌ను అదుపులోకి తీసుకునేందుకు సీఐడీ డీజీ షికా గోయెల్ ప్రత్యేక బృందాలను పంపించారు. ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐ, ఇద్దరు ఎస్సైలతోపాటు నలుగురు సిబ్బందితో కూడిన బృందం గురువారం అర్ధరాత్రి భీమ్‌గల్‌కు చేరుకొని శుక్రవారం తెల్లవారుజామున సుభాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం ఏజెంట్‌ను అదుపులోకి తీసుకున్న విషయాన్ని భీమ్‌గల్ సీఐ నోటీసులో పెట్టి సుభాష్‌ను తమ వెంట తీసుకువెళ్లినట్లు తెలిసింది.



మాట్లాడుతున్న ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో కమలవర్ధనరావు

# ఏప్రిల్ నుంచి ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ

### ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో కమలవర్ధనరావు వెల్లడి

బోధన్, జనవరి 20: కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆహార భద్రత పథకం కింద ఏప్రిల్ నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సీఈవో కమల వర్ధనరావు తెలిపారు. మండలంలోని అమ్దాపూర్‌లో శనివారం నిర్వహించిన 'వికసిత భారత సంకల్ప యాత్ర'లో ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమల వర్ధనరావు మాట్లాడుతూ.. ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రసాయనాలతో కలుషితం కాని ఆహారం కోసం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని, ఈ దిశగా రైతులు కూడా చైతన్యవంతులు కావాలని కోరారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడంలో డీఎంహెచ్‌వోలు శ్రద్ధ వహించాలని సీఈవో సూచించారు.

## వరద కాలువకు నీటి విడుదల

మెండోరా( ముప్కాల్), జనవరి 20: జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ముప్కాల్ వరద కాలువకు 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఈఈ చక్రపాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగి పంటల సాగుకోసం నీటి విడుదల చేపట్టినట్లు పేర్కొన్నారు. వరద కాలువ తీర ప్రాంత రైతులు, జాలర్లు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## 'సలైవా'తోనే కుక్కలు కరుస్తాయి..

ఎక్కువగా సలైవా(సొల్లు) కారే వీధి కుక్కలే కాటు వేస్తాయి. సలైవా కారే కుక్కలను గమనించి జాగ్రత్తగా ఉండాలి. వీటిలో ఎక్కువగా వైరస్, రేబిస్ ఉంటుంది. ఒక్కోసారి కుక్కలో వైరస్ ఎక్కువగా ఉంటే... కుక్కకాటు బాధితుడికి వేసే వ్యాక్సిన్‌లు ఒక్కోసారి పనిచేయవు. ఇంట్లో పెంచుకునే వారు కుక్కలకు తప్పకుండా యాంటీ రెబిస్ టీకాలు వేయించుకోవాలి. సీజనల్‌తో కుక్కకాటుకు సంబంధం లేదు. సలైవా(సొల్లు) ఎక్కువగా కారడంతోనే కరుస్తాయి.

– డాక్టర్ ఉమామ సాహేర్, పశువైద్యురాలు, మాక్లూర్


**ఉమ్మడి జిల్లాలో వీధి కుక్కల స్వైరవిహారం**

**పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ దాడులు**

**బయటికి రావాలంటేనే జంకుతున్న జనం**

## ప్రమాదకరం.. ప్రాణాంతకం

వైరస్ సోకిన కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి వస్తుంది. దీనికి టీకా తీసుకోకపోతే పక్షవాతం, కోమా, చివరకు మరణించే ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రెబీస్ సోకితే మెదడు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. కుక్క కరిచినప్పుడు దాని దంతాలు శరీరం లోపలికి వెళ్లి వైరస్ సోకుతుంది. ఇలాంటి సమయంలో యాంటీ రేబిస్ టీకా తీసుకోవాలి. లేకపోతే ప్రాణాపాయ స్థితికి చేరుకునే ప్రమాదం ఉన్నది.



*మాక్లూర్ మండలం కల్లెడి గ్రామానికి చెందిన హర్షవర్ధన్ అనే బాలుడిపై గత నెలలో వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో 15రోజులపాటు చావుబతుకుల మధ్య పోరాడి చివరికి ప్రాణాలు విడిచాడు.*

*కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వికాస్‌నగర్‌లో శుక్రవారం వీధి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులు తీవ్రగాయాలపాలయ్యారు. ఇంటి ముందు ఆడుకుంటుండగా పిల్లలపై వీధి కుక్కలు దాడి చేయగా తల, చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి.*

**ఇలా నిత్యం** ఏదో ఒక చోటు కుక్కల దాడి ఘటనకు సంబంధించిన వార్తలు వినిపిస్తూ ఉన్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వీధి కుక్కల బెడద ఎక్కువయ్యింది. కుక్కకాటుకు గురైన బాధితుల సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతున్నది. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ, నగరాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇంటి నుంచి బయటికి వచ్చే చిన్నారులతోపాటు పెద్దలపై ఆకస్మికంగా దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. కుక్కకాటుతో దవాఖానకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నది. కుక్కల స్వైరవిహారంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

– కామారెడ్డి/ మాక్లూర్/ ఖలీల్‌వాడి, జనవరి 20

**దడ పుట్టిస్తున్న శునకాలు**

# వీధి కుక్కల వీరంగం

**20 రోజుల్లో నిజామాబాద్ డివిజన్‌లో 347 మంది కుక్కకాటు బాధితులు**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు డివిజన్లలో వందలాది కుక్కలు సంచరిస్తున్నాయి. కుక్కల దాడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒంటరిగా వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులను వెంటపడి కరుస్తున్నాయి. మరోవైపు జిల్లా ప్రభుత్వ దవాఖానలో కుక్కకాటుకు గురైన కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తెలిపారు. ఈ నెల 19 వరకు జీజీహెచ్‌కు 267 మంది కుక్కకాటు బాధితులు చికిత్స పొందినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ డివిజన్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 347 కుక్కకాటు కేసులు నమోదైనట్లుఅధికారులు పేర్కొన్నారు. సిరికొండ పీహెచ్‌సీలో 51, ఇందల్వాయి 35, కల్లెడి 14, ముదక్‌పల్లి 16, మాక్లూర్ 5, బినోలా 3, యూపీహెచ్‌సీ సీఎస్ కాలనీ 14, మాలపల్లి 7, ఎస్ఆర్ నగర్ 5, వినాయక్‌నగర్ 27, ధర్పల్లి సీహెచ్‌సీ 67, డిచ్‌పల్లిలో 59, నవీపేటలో 44 కేసులు నమోదైనట్లు తెలిపారు.

**కామారెడ్డిలో..**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్లా రోడ్, స్టేషన్ రోడ్, సుభాష్ రోడ్, విద్యానగర్‌తోపాటు పలు వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఉదయం పూట ఎవరైనా ఒంటరిగా వెళితే వారి వెంట పడుతున్నాయి. ఈ విషయమై కాలనీవాసులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. కుక్కలను నివారించే ప్రయత్నం కూడా చేయడం లేదు. ఇప్పటికైనా కుక్కల బెడదను నివారించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానకు రోజుకు ఇద్దరు, ముగ్గురు కుక్కకాటు బాధితులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

### జిల్లాలో 5వేల డోస్‌లు..



కామారెడ్డి జిల్లాలోని పశువైద్యశాలల్లో యాంటీ రేబిస్ టీకాలు 5వేల డోస్‌లు అందుబాటులో ఉన్నాయి. నాలుగు నియోజకవర్గాల్లోని నలుగురు అధికారులు పాఠశాలల్లో విద్యార్థులతోపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– కె.సింహారావు, జిల్లా పశువైద్యాధికారి, కామారెడ్డి

## ప్రియమైన ప్రయాణికుడా..




ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ట్రాఫిక్ పోలీసులు తరచూ ఫైన్లు విధించడం చూస్తుంటాం. కానీ నగరంలో ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై విన్నూతంగా అవగాహన కల్పించారు. గులాబీపూలు అందజేసి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం ద్వారా కలిగే అనర్థాలను వివరించారు.

– వినాయక్‌నగర్, జనవరి 20

# బెల్టుషాపులపై నిర్లక్ష్యం వద్దు

### సంబంధిత అధికారులకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశం



హున్సాలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్, జనవరి 20: నియోజకవర్గంలోని గ్రామాల్లో బెల్ట్ షాప్‌లు ఎక్కువగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ విషయంలో ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. రైతులు కోరుకుంటే నిజాంషుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. సాలూరా మండలంలోని హున్సా, ఖాజాపూర్, సాలూర, సాలూర క్యాంప్, జాడిజమాల్‌పూర్, కల్దుర్కి, చిన్న మావంది, పెగడాపల్లి తదితర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హున్సాలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్యాక్టరీలను తెరిపించే అంశంపై అధ్యయనం కోసం ఒక కమిటీని నియమించిందని, ఇందులో తనతో పాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మరి కొంతమంది ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలంటే రైతులు ఏదో రెండు, మూడు గ్రామాల్లో కాకుండా పెద్ద ఎత్తున చెరుకును పండించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే ఫ్యాక్టరీ యజమానికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. రైతులు ఎక్కువ దిగుబడి వచ్చేలా చెరుకును సాగుచేస్తేనే లాభం చేకూరుతుందన్నారు. హున్సా, సాలూరలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఆయన ..విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషిచేస్తానని అన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా కాంగ్రెస్ నాయకుడు తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎంపీపీ బి.గంగాశంకర్, బోధన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు పాషా మొయినుద్దీన్, డి.నాగేశ్వర్‌రావు, అల్లె రమేశ్, వై.నరేందర్‌రెడ్డి, మందర్న రవి, శీల శంకర్ పటేల్, చిదురపు అశోక్, కేజీ గంగారాం, బుయ్యన్ సురేశ్, సుందర్ రావు తదితరులు ఉన్నారు.

# ఓటరు నమోదు డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, జనవరి 20: ఓటరు నమోదు కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. పట్టణంలోని హరిజనవాడ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రంలో శనివారం చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియను అదనపు కలెక్టర్ మనూచౌదరితో కలిసి పరిశీలించారు. ఓటరు నమోదు, సమరణల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 913 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు నమోదు కొనసాగుతుందని, 2024 జనవరి ఒకటి నాటికి 18 ఏండ్లు నిండినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీంతోపాటు తప్పుల సవరణ, మార్పులు, చేర్పుల కోసం బీఎల్వోల వద్ద ఫారాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జనార్దన్, బీఎల్వోలు పాల్గొన్నారు.




కామారెడ్డిలోని హరిజనవాడ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

# చట్టానికి లోబడి వ్యవహరించాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

ధర్పల్లి, జనవరి 20 : రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలను కల్పించిందని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతను గుర్తెరిగి చట్టానికి లోబడి వ్యవహరించాలని సూచించారు. మండలంలోని దుబ్బాక గ్రామంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించగా..జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సునీత కుంచాల మాట్లాడుతూ.. పల్లె వాతావరణం ఎంతో ప్రశాంతమైనదని, ఆ వాతావరణం పాడు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. చట్టానికి వ్యతిరేకంగా గ్రామంలో ఎవరూ నిర్ణయాలు తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాలపై సరైన అవగాహన లేక కొన్నిపొరపాట్లు చేస్తున్నారని, అవగాహన కల్పించడం కోసమే ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు వివరించారు. పిల్లలకు చదువుతో పాటు సంస్కారం నేర్పాలన్నారు. చిన్నారులపై లైంగికదాడులు ఎక్కువవుతున్నాయని, వాటిపై ఫిర్యా దు చేయడానికి వెనుకాడుతున్నారన్నారు. దీనికి కారణం తమ బిడ్డ సమాజంలో లోకువ అవుతుందనే ఆలోచనతో ఫిర్యాదు చేయడం లేదన్నారు. కానీ ఇలాంటి సంఘటనలు జరిగితే ఫిర్యాదు చేస్తే సదరు బాలిక వివరాలు బయటికి రాకుండా సరైన న్యాయం అందేలా చూస్తామన్నారు. కేసులు పెడితేనే ఇలాంటి సంఘటనలు పాల్పడ్డ వారికి శిక్షలు పడుతాయని, మరోమారు ఇలాంటి చర్యలకు పాల్పడరని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సీపీ కల్మేశ్వర్ ట్రైనీ ఐపీఎస్ చైతన్య, అడిషనల్ డీజీపీ జయరాం, రూరల్ ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి, ఆర్డీవో, ఎంపీపీ నల్ల సారిక, అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల